# పందెం

## అవతారిక:

'పందెం'' అంది వినత
''పందెం'' అంది కద్రువ
ఆలోచించుకో! ఓడిపోతావ్. ఆ గుర్రానికి తోక మీద నల్లని మచ్చ లేదు అంది వినత
''కాదు! ఉంది. నేను చూశాను'' అంది కద్రువ.
'అయితే దగ్గరగా వెళ్లి చూదాం పద'' అంది వినత. వాళ్లు వెంటనే వెళ్లివుంటే భారతం కథే ఉండేది కాదు. అక్కడే ఉంది కిటుకు.

''రేపు'' అంది కద్రువ. అది పందెం గెలవడానికి నాంది. ఆదికవి, ఆదికావ్యం ఆదిపర్వంలోనే పందెం ఎలా గెలవాలో నేర్పాడు ఆర్యులకి. అప్పట్నుంచీ అదొక జాడ్యమై మానవజాతిని పీక్కు తింటోంది. పందెం అనగానే అది ఎలాగైనా గెలవాలనే ఒక విధమైన మానసిక పీడనానికి లోనవుతాడు మానవుడు. ఆ దౌర్బల్యం అతన్ని అటో ఇటో తేల్చుకునే వరకూ నిద్రపోనివ్వదు.

ఆ తర్వాతి కాలంలో ధర్మరాజూ కట్టాడు పందాలు. నాటి నుంచీ నేటి గుర్రప్పందాలు, గొర్రెపొట్టేళ్లపందాలూ, కోళ్లపందాల వరకూ పందాలు మూడుపువ్వులూ ఆరుకాయలుగా విరాజిల్లుతూనే ఉన్నాయి. ఈ మధ్య నవ నవలల్లోనూ, సినిమాల్లోనూ వీటి వాడకం మరీ ఎక్కువైపోయింది. అంతెందుకూ మనిషి జీవితంలో చేసే ప్రతి పనీ ఓ పందెంలాంటిదే కదా! ఏదో ఆశించి ఏమేమో చేస్తాడు. దేముడితో పందెంవేస్తాడు. గెలిస్తే తన గొప్ప, ఓడిపోతే... ఇలా వితర్కించుకుంటూ పోతే ఈ జగత్తే పందెంమయం అనిపిస్తుంది.

## అసలు కథ:—

''పందెం'' అన్నాడు ప్రకాశ్.
''పందెం'' అన్నాడు కౌండిన్య.
''ఇదుగో! ఈ రాజుగాడే సాక్ష్యం'' అన్నాడు ప్రకాశ్.

''ఓడిపోతే నువ్వేం ఇస్తావ్?'' అడిగాడు కౌండిన్య. ''నిన్ను 'గురూ' అని పిలుస్తాను. ఏ వ్యసనాలూ లేని నేను నీతో బాటు బార్‌లో కూచుని బీరు తాగుతాను సిగరెట్లు తాగుతాను. ఇంకేం చెయ్యమన్నా చేస్తాను'' అన్నాడు ప్రకాశ్.

రాజు మౌనంగా వాళ్లిద్దరి సంభాషణ వింటున్నాడు. అతని భయం వేరు. ఈ పందెం ఇక్కడితో ఆగకపోతే ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందో అని. అతను మరీ దూరం— చాలా దూరం ఆలోచిస్తాడు. అందుకే తెగించి ఏ పనీ చేయలేదు. కౌండిన్యలో మరుకు పాలెక్కువ. అనుకున్నంత సేపు పట్టదు అతనే పనైనా చేయడానికి. ప్రకాశ్ దిజాలీ గో లక్కీ టైపు.
''రెడ్డి కాలేజీ''కి కూత వేటు దూరంలో మూడు రోడ్ల కూడలిలో చేరి మాట్లాడుకుంటున్నారు, ఈ ముగ్గురు మిత్రులూ

అప్పటికి రాత్రి పదకొండు గంటలైంది. దసరా రోజులు. కొంచెం చలిచలిగా ఉంది. ప్రక్కనున్న మేడ బాల్కనీలోకి రాజు తల్లి వచ్చి కేకేసింది.
''ఏమ్రా! మీ కబుర్లు ఎప్పటికి పూర్తయ్యేను. ఒకరినొకరు వదిలి పెట్టలేని ప్రేమత్రికోణంలోని ప్రేయసీ ప్రియుల్లా ఏమిటా ముచ్చట్లు? పోనీ

## కుర్రతనం పందెం వయసుమళ్లిన శాంతం

ఇంట్లో కొచ్చి కూర్చుని మాట్లాడుకోరాదూ. ఇల్లూ వాకిలీ లేని వాళ్లలా ఆ రోడ్డు మీద ఏంటి?'' అని ''వచ్చేస్తున్నానమ్మా!'' అని నిస్సహాయంగా మిగతా ఇద్దరి వైపూ చూశాడు రాజు. వాళ్లిద్దరూ చెరో వైపూ మళ్లారు. వెళ్తూ వెళ్తూ ప్రకాశ్ అన్నాడు. ''పందెం సంగతి మరిచి పోవుగా?'' మరిచి పోడం గూడానా? రేపే ప్రారంభోత్సవం అన్నాడు కౌండిన్య.

రాజువాళ్లది హైదరాబాదే! కౌండిన్య వాళ్ల చుట్టాల ఇంట్లో ఉంటున్నాడు. ప్రకాశ్ హాస్టల్లో ఉంటాడు. ఈ ముగ్గురూ డిగ్రీకాలేజీ విద్యార్థులు ప్రాణమిత్రులు. పైలా పచ్చీసుగా తిరిగే కాలేజీ చదువులు, జీవితం అంతా రంగుల మయం అనిపించే రోజులు 'హల్లో బేబీ! టైమెంతయింద'ని బహిరంగంగా రోడ్డుమీద ఆడపిల్లని పలకరించే ధైర్యాన్నిచ్చే వయసు. కాలేజీకివెళ్తుండగా ఎదురైన అమ్మాయిలు అబ్బాయిలు, ఒకళ్ళనొకళ్లు పంచేసుకునే ధైర్యం. ఓహో యవ్వన సామ్రాజ్య పట్టాభిషిక్తుందే కదా అదృష్టం అంటే!

సూర్యవతి నాది, నువ్వు పల్కరించడానికి వీల్లేదు అన్నాడు రాజు.

నీ కంత ధైర్యం వచ్చింది. అదే చాలు. నీకు నా పూర్తిసహకారం లభిస్తుంది. కౌండిన్య జవాబు. మచ్చలమ్మాయంటే ప్రకాశ్‌కి తగని ఇష్టం, మిగిలింది సీగానపెసూనాంబని కౌండిన్య స్వీకరించాడు.

రోజూ కాలేజీ కెళ్లేటప్పుడూ, వచ్చేటప్పుడూ రోడ్డుమీద కలుసుకునే జంటలవి. ఆ పేర్లు ఆ మిత్రులు పెట్టుకున్నవే! వయసిచ్చిన ఆకర్షణని పణంగా పెట్టుకుని, పరస్పరం పందాలేసుకుని ఏదో తెలియని లోకాలకి పరుగులెత్తుకు పోయే కాలమది. అంతా ఓ సంవత్సరం పాటే! మళ్లీ కొత్త పరిచయాలూ, కొత్త మోహాలూనూ. రైలు పెట్టెలో స్నేహంలాగ. కలిసిఉన్నంత సేపూ జన్మ జన్మల సంబంధం లాంటి స్నేహం. ఎవరి స్టేషన్లో వాళ్లు దిగిపోతుంటే మిగిలిన వాళ్లు వాళ్ల గమ్యస్థానం వైపు ప్రయాణం సాగించడం.

ఆ రోజు ఓ విత్రం జరిగింది. ఉరకలు పరుగులు తీసే ఉత్సాహంతో కౌండిన్య ఓ కబురు మోసుకొచ్చాడు. తానుండే బాబాయివాళ్లింటి మేడ మీద 'శ్రావణి' అనే చిలకలాంటి, అమ్మాయుంది. ఆ ఇంటరు చదివే అమ్మాయికో సరస్వతి అనే చెల్లెలుంది. శ్రావణికి తెలియని లెక్క చేసిపెట్టినందుకు 'థేంక్సండీ' అని రాసిన కాగితం ఒకటి సరస్వతి ద్వారా కౌండిన్య చేతికందింది. అది చూపించి ఉక్కిరిబిక్కిరయ్యే ఆనందంతో అన్నాడు కౌండిన్య. ''శ్రావణి నన్ను ప్రేమిస్తోంది'' అని. ''అలాగే కనిపిస్తోంది. అయినా ఏంచేస్తాం లే. తప్పు నీదికాదు నీ వయసుది'' అన్నాడు ప్రకాశ్.

''నీ సంగతి చెప్పు! మరి సీగాన పెసూనాంబనేం చేస్తావు?'' అడిగాడు రాజు.

కౌండిన్య సందిగ్ధంలో పడ్డాడు. ఏమో! ఒకర్ని ప్రేమిస్తున్నా మరొకర్ని కామిస్తున్నానేమో! అన్నాడు.

''ఉత్తుత్తి కబుర్లు చెప్పడం కాదు. ఏదైనా ఓ ఘనకార్యం చేసి చూపించు'' అన్నాడు ప్రకాశ్.

''అంటే!'' అర్థం కానట్టు చూశాడు కౌండిన్య. ఇలాంటి చీటీలు కాదు ఆ అమ్మాయి దగ్గర్నుంచి ఓ ప్రేమ లేఖ సంపాదించు. అప్పుడు ఒప్పుకుంటాం నువ్వు మొనగాడవని ఛాలెంజీ చేశాడు ప్రకాశ్.

''పందెం'' అన్నాడు కౌండిన్య.

ఆ పందెం వెనుక అంతకథ ఉంది. మరి రాత్రి పదకొండు గంటలయిందంటే అవదూ!

రాత్రి ఇంటికెళ్లి పడుకున్నాడు గాని కౌండిన్యకి నిద్రపట్టలేదు. ప్రకాశ్ తనదొక వెర్రి వెంగళా

పాలెపు బుచ్చిరాజు

యి క్రింద జమకట్టేశాడు. వాడికి నేనంటే ఏంటో మహ్మ చూపించాలి. ఓ ఆడపిల్లని అందులో మా ప్రతి నిత్యం ఉన్న ఇంట్లోనే ఎదురుగా తిరుగుతూ కనిపిస్తున్న దానిని బుట్టలో వేయడం అదెంత బ్రహ్మవిద్య! అవసరం అయితే కాలేజీ ఎగ్గొట్టి అయినా సరే శ్రావణితో చనువు పెంచుకుంటాను. నేను తప్ప ఎవర్నీ పెళ్లి చేసుకోను అనిపిస్తాను. అప్పటికి గాని మన పని తెలియదు ప్రకాశ్ గాడికి. ఇలా సాగుతున్నాయి అతని ఆలోచనలు. అలా ఆలోచిస్తూనే తనకు తెలియకుండా ఎప్పుడో నిద్రాదేవి ఒడిలోకి జారుకున్నాడు.

మర్నాడు లేచిన దగ్గర్నుంచీ మళ్లీ అదే ఆలోచన. నెమ్మదిగా శ్రావణికి లెక్కలే గాక ఫిజిక్స్ కూడా ప్రైవేటు చెప్పడం మొదలెట్టాడు. సాయంత్రం పూట శ్రావణి అమ్మా నాన్నా అలా బజారు వెళ్లినప్పుడు డాబా మీద చనువుగా పాఠాల్చెప్పాడు. కాలేజీ కామెని వెనకాలే బాడీగార్డులా అనుసరిస్తూ వెళ్లి దింపి వచ్చేడు. కృతజ్ఞతా భావంతో అందంగా చూసేది శ్రావణి. ఓనాడు సరస్వతి మరో చీటీ ఇచ్చింది, "మీరెంత మంచి వారండీ!"

అని ఉంది అందులో. లోలోపలే మురిసిపోయేడు కౌండిన్య. చాలా థేంక్సండీ జవాబు వెళ్లింది. మరో నాడు ప్రభాత్‌లో మంచి మూవీ ఉంది. నేనూ, మా చెల్లీ వస్తాము. మీరు డైరక్టుగా అక్కడికే వచ్చేయండి మాకు సాయంగా ఉంటారు అని అభ్యర్థన వచ్చింది. పరమానందంగా వరం ఇచ్చాడు కౌండిన్య.

అలా అక్షరాలు మాటలూ, మాటలు వాక్యాలూ, వాక్యాలు పేరాలూ, పేరాలు పేజీలూ అవడానికి ఎంతో కాలం పట్టలేదు. రామరామ ఉత్తరాల ఒత్తిడి ఎక్కువై కనీసం రోజుకొకటైనా ఇచ్చి పుచ్చుకోవడం వరకూ వచ్చాక ఓనాటి లేఖలో అంది శ్రావణి "మీరు కనిపించకపోతే బ్రతకలేననిపిస్తోంది. మనం వేగమే పెళ్లి చేసేసుకోవాలి!"

అందమైన ఆడపిల్లల అంతరంగమే అంత. ఆలంబన దొరకడమే తరువు, తరువుకి లతల్లా అల్లుకుపోతారు. తళుకు మనే చూపులు, అభిమానం పెంచుకోడం, ప్రేమించడం, పెళ్లిదాకా వెళ్లడం అంతా ఒకదాని వెంట ఒకటిగా అర్జెంటుగా అంచలు దాటేస్తారు. ఆ తరవాత వారి సాహసానికి చెలియలి కట్ట ఉండదు.


ఆ రోజు ఉత్తరం అందుకున్నాక ఆనందంతో ఒక్క దాటు వేశాడు కౌండిన్య. సాయంత్రం తిన్నగా వెళ్లి రాజుని కల్సుకున్నాడు. ఇన్నాళ్లూ జరుగుతున్న కథనంతా రోజూ రాజుకి రిపోర్టు ఇస్తూనే ఉన్నాడు. కాని ప్రకాశ్‌కి మాత్రం క్లైమాక్సు నాడే చెప్పడానికి నిశ్చయించుకున్నాడు. ఆ రోజు ఈ రోజు వచ్చింది. పద గురూ! ప్రకాశ్‌ని బార్‌కి తీసుకు పోదాం అన్నాడు ఉత్తరం మడిచి జేబులో పెట్టుకుంటూ. ఇద్దరూ వెళ్లి ప్రకాశ్‌ని తీసుకుని బారుకి దారితీశారు.

ఏదో సరదాకి ఆనాడు వేసిన పందెం విషయం అలానే మరచిపోయిన ప్రకాశ్ ఆశ్చర్యపోయాడు.

అదేంటి గురూ! అన్నంత పనీ చేసేశావు. వాదేముంది, ఓడిపోయానని ఒప్పేసుకుంటున్నాను ఇదుగో బీరు సీసా, ఇదిగో సిగరెట్లు అని ఒక సిగరెట్టు అంటించాడు. నువ్వూ తాగమని రాజుని బలవంతం చేశాడు. అతనొప్పుకోలేదు. "పందెం మీ యిద్దరిదీ. సాక్ష్యంమాత్రమే నేను. ఆ పాపానికి బీరు తాగుతున్నాను చాలు బీడీ లొద్దు" అన్నాడు. "పాప కొసం పాకులాడే పక్షి పాడై పోవులే తాగుము' అని నోట్లో బలవంతాన కుక్కబోయాడు ప్రకాశ్. వద్దులే గురూ! ఒదిలేయ్ అన్నాడు కౌండిన్య. రాజు ముభావంగా ఉండే మనిషి నొచ్చుకుంటాడేమోనని ఇహ ఊరుకున్నాడు.

'బీరకాయ' పూర్తిగా సేవించుకొచ్చి పార్కులో కూర్చున్నాక అన్నాడు రాజు. "ఇంతవరకూ బాగానే ఉంది. ఇహ నువ్వు రేపట్నుంచీ విద్యార్థ్యవతారం ఎత్తుతావా? ప్రేమావతారంలోనే పెర్మనెంటుగా ఉండిపోతావా? పరీక్షలు దగ్గిరకొస్తున్నాయి.

అంటే నీ ఉద్దేశ్యం నేను శ్రావణిని అలా




నట్టడవిలో ఒదిలేసి నాదారి నన్ను చూసుకోమనా? నేనెప్పుడో నిశ్చయం చేసుకున్నాను. నేనామెనే పెళ్లి చేసుకుంటాను. శ్రావణిని నేను త్రికరణ శుద్ధిగా ప్రేమిస్తున్నాను అన్నాడు కౌండిన్య.

గురూ మనం ఏదో సరదాగా ఆడిన నాటకానికి ఇక్కడితో ఫుల్‌స్టాప్ పెట్టడం మంచిదేమో! ఇంకా ముందుకెళ్తే ఎన్నో ఆచారవ్యవహారాల గోతులు జాతుల, నీతుల నూతులు. చిక్కుల్లో పడతావేమో! దీనికంతటికీ కారణం నేనని జీవితమంతా నేను దుఃఖించవలసి వస్తుంది అన్నాడు ప్రకాశ్. "ఏం కాదు! ఏమైనా ఎంత త్యాగం చేసైనా నేను ఆమెనే పెళ్లి చేసుకుంటాను. నన్ను నమ్మి ప్రేమించి నాపై ఆశలు పెంచుకున్న ఆమెను మోసం చేయలేను, ఆవేశంగా చెప్పుకుపోతున్నాడు కౌండిన్య. ఆ ప్రవాహానికి అడ్డువేయాలని అన్నాడు రాజు. సరే ఆ విషయం తరవాత ఆలోచిద్దాం. ప్రస్తుతం మనం పరీక్షలకి తయారవ్వాలి లెండి. వెళ్లి పుస్తకాలు తీద్దాం అని లేచాడు. ముగ్గురూ మూడు విధాలుగా మనసుల్లో ఆలోచిస్తూ ఇళ్లు చేరుకున్నారు.

వేసవికాలపు మెండ నిప్పులు చెరిగినంత వేడిగా ఉంది ఇంట్లో వాతావరణం. కనీసం అలా అనిపించింది కౌండిన్యకి. అగ్ని గోళాల్లాంటి కళ్లతో కోపంగా చూశాడు బాబాయి. "ఏమిట్రా ఈ మితాయి పొట్లాలు?" అని ప్రశ్నించాడు టేబిలు మీదున్న కవర్లని చూపిస్తూ. అవి తను ప్రాణప్రదంగా దాచుకున్న శ్రావణి ప్రేమలేఖలు. కౌండిన్యకి ప్రాణాలు పైనే పోయాయి. విషయాన్ని అవగాహన చేసుకోడానికతనికెంతో సేపు పట్టలేదు. నేనా అమ్మాయిని ప్రేమించాను. పెళ్లి చేసుకోదల్చుకున్నాను ధైర్యంగా జవాబు చెప్పాడు. పెళ్లి వరకూ వచ్చిందన్న మాట! అదేదో నువ్వూ మీ నాన్నా తేల్చుకుందురు గానీలే. ఈ నాల్రోజులూ చదివి డిగ్రీ తగలెట్టు అని ధుమధుమలాడుతూ లోనికెళ్లిపోయాడు బాబాయి.

మర్నాడేదో పెద్ద రభసే జరుగుతుందనుకున్నాడు కౌండిన్య. కాని అగ్నిపర్వతపు గర్భంలా వాతావరణం ప్రశాంతంగానే ఉంది. కాకపోతే శ్రావణి మళ్లీ కంటబడ లేదు. వాళ్లింట్లో కూడా తెలిసిపోయిందేమో. అయినా ఒకసారి తాను స్థిర నిశ్చయం చేసుకున్నాక ఎవరికీ భయపడ కూడదనుకున్నాడు కౌండిన్య. కొన్నాళ్లు పోయాక, అతి కష్టం మీద శ్రావణిని కలుసుకోగలిగాడు. గుడ్ల నిండా నీరు గుక్కుకుని తన అసహాయతని ప్రకటించింది ఆబల.



''మన బండారం బైట పడింది. కాని శ్రావణి నువ్వు భయపడకు. నేను వీళ్లందర్నీ ఎదిరించైనా నిన్నే పెళ్లి చేసుకుంటాను'' అని మాట ఇచ్చి పంపించాడు.

పెనుగాలికి చలించి పోయే లతలా వణికిపోవడం తప్ప ఏమీ మాట్లాడలేక పోయింది ఆమె.

పరీక్ష లయిన మర్నాడే కౌండిన్య నాన్నగారు వచ్చి ''అమ్మ నిన్ను చూడాలంటూంద''ని ఆలోచించుకునే టైము కూడా ఇవ్వకుండా రైలెక్కించి తనవెంట తీసికెళ్లి పోయారు. కనీసం శ్రావణిని కాని, ప్రకాశ్, రాజులని కాని కలుసుకుని మాట్లాడే అవకాశం కూడా ఇవ్వలేదు. నెల తిరక్కుండానే ఉన్న ఊళ్లో తాలూకాఫీసులో ఉద్యోగానికి దరఖాస్తు పెట్టించారు. నేనింకా చదువుకుందామనుకుంటున్నాను అంటే హైదరాబాద్‌లోనా? అని అగి ప్రస్తుతం ఖాళీగా ఉండడం దేనికి, ఉద్యోగంలో చేరు తరువాత ఆలోచిద్దాం అన్నారు. ఇది ఇంట్లో వాళ్లంతా కలిసిచేస్తున్న కుట్ర ఏమో అనిపించింది కౌండిన్యకు.

ఉద్యోగంలో జాయినయ్యాక శ్రావణికి రెండు మూడుత్తరాలు రాశాడు. జవాబురాలేదు. సెలవు అయ్యాక మళ్లీ కాలేజీలో చేర్పించే ప్రయత్నాలేం చెయ్యలేదు నాన్న. ఓ సారి బాబాయి వచ్చినప్పుడు తెలిసింది. శ్రావణి వాళ్ల నాన్న బదిలీ చేయించుకుని అక్కణ్నించి వెళ్లిపోయారని. మనసులో ఏ మూలనో మినుకుమినుకు మంటున్న ఆశాజ్యోతి ఆనాడు ఆరి పోయింది. ఇప్పుడాలోచిస్తే తెలిసివచ్చింది కౌండిన్యకి. అందాల బరిణె లాంటి శ్రావణిని ఆరాధించాడే తప్ప వాళ్ల అతా, పతా కనుక్కోక పోవడం ఎంత తప్పు చేశాడో! అయినా పరిస్థితి ఇలా విషమిస్తుందని కలగన్నాడా! ఇక జీవితంలో మళ్లీ శ్రావణిని కలుసుకోవడం అసంభవమేమో. ఈ పెద్ద వాళ్లింత దారుణంగా ఎలా ప్రవర్తిస్తారో. అంతా కలిసి కుట్ర చేసి మమ్మల్ని విడదీశారు. ఈ ఆలోచనతోనే తండ్రితో అన్నాడు ఓనాడు, మీరు నాకేదో పిల్లని చూపించి కట్నం కానుకలు తీసుకుని పెళ్లి చేద్దామనుకుంటున్నారేమో, అలా ఎప్పటికీ ఒప్పుకోను. నేనెప్పటికైనా ఆ అమ్మాయినే చేసుకుంటాను అని.

ఆ విషయం నాకూ తెలుసులేవోయ్. లేకపోతే ఈ కాలపుపిల్లలు మాకు నెత్తిమీద రాయి పెడతారని నేనేమీ ఆశించడం లేదు. నువ్వు నీకాళ్ల మీద నిలబడి నీ జీవితం సంబాళించుకోగలిగిన్నాడు అలాగే చేద్దువుగాని. ఈ లోగా కుప్పిగంతులేసి బంగారు భవిష్యత్తుని పాడు చేసుకోవద్దనే మేము చెప్పేది ,అని సమాధానం ఇచ్చారు నాన్న.

నెలలు తిరిగి సంవత్సరాల్లోకి వచ్చాయి. కౌండిన్యకి చాలా కసిగా ఉంది కుటుంబంమీద, సంఘం మీద జీవితంమీద రోజురోజుకీ శ్రావణికీ తనకీ గగనానికీ ఇలకూలా బహుదూరం అనిపిస్తోంది. ఏదైనా చెయ్యాలనిపిస్తోంది. ఏమీ చెయ్యలేక పోతున్నాడు. ఆలోచించి, ఆలోచించి ఓ దృఢ నిశ్చయానికొచ్చాడు.

* * * *

రాజు అకస్మాత్తుగా కౌండిన్య దగ్గర్నుంచి వచ్చిన ఉత్తరాన్ని చదివి ఆశ్చర్యమగ్నుడయ్యాడు. తనతో కలిసి తాలూకాఫీసులో పనిచేసే ఓ బీద అమ్మాయిని ఏ ఆర్భాటాలూ లేకుండా పెళ్లి చేసుకున్నానని అంతా వాళ్ల కుటుంబం అంగీకారంతోనే జరిగిందని దాని సారాంశం.

ఒకనాడు ఇలా జరక్కుండా మరోలా జరిగివుంటే ఎలా వుండేది అని ఆలోచించడం వ్యర్థం. దాని పర్యవసానం ఇప్పుడెలా ఉంది అన్నది ప్రస్తుతం. ఏ ఘటన ఎలా రాసి పెట్టి ఉందో అలాగే జరుగుతుంది అనుకుని నిట్టూర్చాడు రాజు.

తరవాత రాజుకీ పెళ్లయింది. నాన్నా చూపించిన సాంప్రదాయమైన కుటుంబంలోని పిల్లని పెళ్లి చేసుకున్నాడు. కట్నంకానుకల విషయం తాను పట్టించుకోలేదు. తల్లిదండ్రులమీద ఒదిలేశాడు. హైదరాబాద్‌లోనే ఉద్యోగంలో స్థిరపడ్డాడు. ప్రకాశ్ మాత్రం కులంలో పిల్లనే ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. అతనికీ హైదరాబాద్‌లోనే చిన్న ఉద్యోగం దొరికింది.

జీవితంలో ఒక రొటీనుకి అలవాటు పడిపోయిన తరవాత రోజులెలాగడుస్తున్నాయో తెలియదు. రోజులేమిటి,సంవత్సరాలే అలా అలా గడిచిపోతాయి. పిల్లలుగా ఉన్నవాళ్లు పెద్ద వాళ్లయ్యారు. వారికి పిల్లలు పుట్టారు. కౌండిన్య పెద్ద కూతురు ఇంటరులో ఉండగా వాళ్లకి హైదరాబాద్ బదిలీ అయింది. ఏ.జీ ఆఫీసుకి. రాజు వాళ్లరెండో కొడుకు అయిదో పుట్టిన రోజు పండుక్కి స్నేహితులిద్దర్నీ ఆహ్వానించాడు. వాళ్ల ఆఫీసుకి కొత్తగా వచ్చిన మరో కొలీగ్ శ్రీపతిని కూడా పిలిచాడు. అతను శ్రావణి భర్తకావడం యాదృచ్ఛికం. ఇప్పుడు వాళ్లంతా పరిణతి చెంది లోకజ్ఞానం కలిగిన వాళ్లు. సరదాగా కబుర్లు చెప్పుకున్నారు. పిల్లలంతా కలిసి ఆడుకున్నారు. పార్టీ పూర్తయి ఎవరిళ్లకి వాళ్లు వెళ్లాక,

''ఆ తెల్ల జుట్టాయన ఉన్నాడే ఆయనే కౌండిన్య'' అని చెప్పింది శ్రావణి భర్తతో.

''తెల్లగా పొట్టిగా కొంచెం లావుగా ఉందే, శ్రీపతి భార్య ఆమే శ్రావణి' అని చెప్పాడు కౌండిన్య భార్యతో.

''ఓహో వీళ్లేనన్న మాట ఆ నాయకీనాయకులు'' అన్నారు రాజు, ప్రకాశ్‌ల భార్యలు.

భరతవాక్యం:— ''ఈ కథ నిజంలా ఉంది'' అంది నా శ్రీమతి అనుమానంగా నాకేసి చూస్తూ.

''కాదు కల్పితం'' అన్నాను నేను.

'పందెం' అంది శ్రీమతి.

'పందెం' అన్నాను నేను.